# పండుగ సంభ్రమము

శ్రీమతి మూలపీపాల పార్వతీదేవిగారు

'నాన్నగారూ! ఇంకా రైలువేళుందా?' అంది లీల పెద్ద నిట్టూర్పు విడుస్తూ, వంటింటి గుమ్మందగ్గిర కూర్చుని.

'ఇంకా వొకఘంట టైముందనుకుంటా నమ్మా! అప్పటికీ రాకపోతే నీవుకూడా భోజనం చెయ్యొచ్చ'న్నాడు, లీల తండ్రి ఆలోచిస్తూ మేడమీద పచారీచేస్తూ.

అలాగే వంటింటి గుమ్మందగ్గిర పట్టుచీర కట్టుకుని భర్తరాక కెదురు చూస్తోంది లీల. ఆమె తల్లికూడా కొంచెం దూరంలో అక్కడే కూర్చుంది.

లీలావతికి ముద్దుపేరు లీల. ఈమె పది యారేండ్ల బాల. మంచి చక్కని చామన చాయ పిల్ల. కళ్లుకూడా మంచి తీరుగా బేడిసల్లావుంటాయి. అంచేత రతీదేవిని ధిక్కరిస్తూ వుంటుంది అందంలో. సకల విద్యలూ నేర్పిన సరస్వతికూడాను.

లీల కాపురాని కెళ్లి రెండు సంవత్సరాలౌతుంది. ఈమె కాపురాని కెళ్లిన సంవత్సరందాటే కామెభర్త యేదో చదవడానికని కలకత్తా వెళ్లేడు. అనురాగం భార్యాభర్తల కిద్దరికీ అధికంగా వుండడంచేత భర్త కలకత్తా వెళ్లి ఆరునెల్లేఅయినా అతన్ని చూడాలని లీల యెక్కువగా ఆత్రుత పడుతూవుండేది. లీల సంగతి గ్రహించి ఆమె తండ్రి అల్లుడ్ని [illegible]క్కైనా రమ్మని వుత్తరం వ్రాసేడు కలకత్తా. అత్తవారు పట్టుదలగా యెంత ఖర్చైనా పండుగకి రమ్మని వ్రాసేరని తప్పకుండా వస్తానని రిప్లైయిచ్చేడు జనార్దనుడు. అంతకుముందు మూడు రోజులనించి వస్తాడని కనిపెట్టుకు చూస్తున్నారు లీలా ఆమె తలిదండ్రులున్నూ. తెల్లవారితే పండుగొస్తుంది. రాత్రిపదైంది. లీల భోజనంమాని భర్తకోసం కనిపెట్టుకు చూస్తూవుంది. ఇంకా రాలేదు జనార్దనుడు.

లీలమనస్సు పరిపరివిధాల పోతోందిప్పుడు. తనభర్త వస్తాడో రాడో అని ఆమె సందేహం. ఏదేనా ఆటంకం వచ్చిందో; లేకపోతే అతని దేహారోగ్యానికేమేనా భంగం కలిగిందేమో అని ఆమెభయం. అతని స్వదస్తూరీతో వుత్తరంవ్రాసికూడా రాకపోతాడా అని మళ్లా కొంచెం ధైర్యం తెచ్చుకుని మనస్సు సమాధాన పర్చుకుంటూ వుందా విచారంలోనే. ఆమె గాలి దివ్యభవనాల్ని నిర్మించుకుంటూవుందిప్పుడు.

అతను వ్రాసినప్రకారం కలకత్తాలో రైలెక్కడం; తరవాత అతని స్వగ్రామం చేరడం; అక్కణ్నుంచి మళ్ళా రైలెక్కి లీల పుట్టింటివారూరి స్టేషనులో దిగడం; దిగిన వెంటనే జట్కాకట్టించుకుని యింటికిరావడం; చీడీమెట్లెక్కి తలుపుతట్టడం;...కాని తలుపుచప్పుడు వినిపించుతేనా? అంచేతా

భావలతక్కడవరకూ మాత్రమే వ్యాపించి, అక్కడ నిరాశాలవిత్రముచేత కోసివేయ బడుతూవుంది.

లీల చెవులు జట్కాచప్పుడుగాని బండీ చప్పుడుగాని ఆకర్షించడానికి సిద్ధంగావున్నాయి. ఇంతలో జట్కాల చప్పుడు వినిపించింది లీల చెవులుకి. 'నాన్నగారూ! బళ్ల చప్పుడౌతోంది; రైలొచ్చినట్టేనా?" అంది సందేహ సంతోష సంకలితమైన మనస్సుతో లీల. 'ఔను, రైలొచ్చినట్టేవుందం' టూ మేడమెట్లొకొక్కటే దిగొస్తున్నాడు సుందరంపంతులు. ఇప్పుడు దాగర్లోపడ్డ వెలక్కాయలా వేగిపోతోంది లీల మనస్సు.

ఒకొక్కక్క జట్కాయేవరసగా వెళిపోతోంది వీళ్లింటిముందునించే. చప్పుడు బహు జాగ్రత్తగా వింటోంది లీల. ఒకటీ ఆగడం కనిపించదు. ఓ పదిపదిహేను జట్కాలు వరసగా వెళిపోయినతరవాత, ఓజట్కా సమంగా వీళ్లింటిముందే నిలబడ్డట్టు లీల మనస్సుకి తట్టింది. దిగ్గునిలేచి లాంతరు పట్టుకుని వీధితలుపు తియ్యడాని కెళ్లిందామె. ఆమె తలుపు తీస్తూవుండగానె 'ఇక్కడ కాదు, యింకానడవనీ' అన్నమాట వినిపించింది. జట్కా నడిచిపోయింది. జట్కా వెళిపోయేసరికి వీధితలుపుదీసి విఫలమనోరథమై వెర్రివెర్రి చూపులు చూస్తూ వీధి గుమ్మంవద్గిర నిలుచుంది. ఇంతలో ఆమెతల్లి అన్నపూర్ణమ్మకూడా ఆమెను కలిసింది. 'ఈ జట్కా కాదమ్మా! వెళిపోయిందం'ది లీల.

మేఘసంకీర్ణమై యంధకారబంధురమైన రాత్రిని ప్రయాణంసాగించే పాంథుడికి మెరపుదీగతోవ చూపించినట్టు, సందేహాంధకార నిమగ్నమానసమైన లీలకి 'నీభర్తొస్తున్నాడ'ని చెప్పడాని కొచ్చినట్టుతటిల్లతా ద్యుతిని తలదన్ను కాంతితో అంతకుమించిన వేగంతోను వో జట్కావస్తోంది స్టేషన్తోవనించే. బహు ఆత్రుతతో ఆజట్కావేపు చూస్తున్నాది లీల. అంత వేగంతో వస్తున్న ఆజట్కా అక్కడాగదని బ్రమపడ్డ దామె. కాని తకీ మనక్కడే నిల్చిందా జట్కా. అధిక సంతోషస్వాంతయై చూస్తూవుంది లీల.

అంతలో వో నవీన యువకుడు దిగేడందులోంచి. అప్పుడు లీలసంతోషం చెప్పడానికి వశంగాదు. మబ్బువేసినప్పుడు మయూరిక సంతోషించినట్టు సంతోషిస్తోంది లీల. దీపం చూపించిందాయువకుడికి. బండివాడు సూట్కేస్ తెచ్చి గుమ్మంలోనుంచేడు. బండివాడికి డబ్బిచ్చేసేడు జనార్దనుడు లాంతరు వెలుతుర్ని. లీల పెట్టెపట్టుకుని లాంతరుచూపిస్తూవుండగా యింట్లోకొచ్చే డతడు. పెట్టక్కడుంచి భర్తకి కాళ్లుకడుక్కోడానికి చెంబూ నీళ్లూ యిచ్చింది లీల. అక్కడుంచిన పెట్టెని అన్నపూర్ణమ్మ తీసుకెళ్లి మేడమీద గదిలో పెట్టింది. మామగారు కుశలప్రశ్నలు ముగించిన తరవాత మడిగట్టుకు భోజనంచేసేడు జనార్దనుడు. భోజనానంతరం మామా జామాతల మాట్లాడ్డంఅయేక 'చాలా రాత్రైంది పడుకోవోయి'అని సుందరం

పంతులు పడుకోడాని వెళ్లేడు. జనార్దనుడు శయ్యామందిరంచేరి పందిరిమంచంమీద వెల్లకిలా పడుక్కుని లీలరాక కెదురుచూస్తు న్నాడు. ఆవేళ మర్రెండు చేతులెరువు తెచ్చు కుని అతివేగంగా భోజనం చక్కబెట్లూ ముగించుకుని భర్తసాన్నిధ్యానికి బలేగా తయారై యొచ్చింది లీల.

'ఓహో! రాణీగారు! క్షేమంగావున్నా రా'అన్నాడు జనార్దన్ నవ్వుతూ. లీల నును సిగ్గుతో క్రీగంటచూస్తూ వోచిరునవ్వు జవాబుగా నవ్వింది. ........

'అల్లుడిరికం చూపించుకోడానికాబో లర్ధరాత్రప్పుడొచ్చేరు ? రాజాగారు!' అంది పరిహాసంగా చిన్ననవ్వు నవ్వుతూ లీల... నే నెప్పుడే నా జ్ఞాపక మొచ్చేదాన్నా కలకత్తాలో ?"

జ్ఞాపకం లేకపోతే చీరెలా పంపించేను? చీరందినట్టు నువ్వే వుత్తరంకూడా వ్రాయ లేదు. నీకానాకా జ్ఞాపకం లేకపోవడం?'

'ఔనౌను మీరలాగే అనుకుంటారు. మొన్న వొస్తానని మీ రివ్వాళదాక రాక పోతే నేనెంత బెంగపెట్టుకున్నానో మీ కేం తెలుసు'? అంది చిన్న ప్రణయకోపంతో లీల.

'అబ్బ ! నువొక్కర్తే శ్రమపడ్డట్టూ నేలే నట్టూనా? నేనూ శ్రమపడ్డాను.' అన్నాడు జనార్దన్ పరిహాసంగా.

'ఔను, బస్సూ రైలు జట్కా, కుదుపు గాదూ సుకుమారశరీరాలకీ'అంది లీలావతి వికటంగా.

'ఇంటి దగ్గిరోఘడియ నిద్రలేకుండా వుండడం మరీశ్రమ'

'మీరు రారేమో అని యెంతో...' అంది దీనంగా లీల.

'అయ్యో! పాపం'అంటూ దగ్గరకు తీసేడు లీలని జనార్దన్. 'పండుగనాడు కట్టు కుంటావని పంపిస్తే యిప్పుడే “కట్టేసు కున్నావేం బెంగాలీ సిల్కుచీర' అన్నాడు లీల నెగాదిగా చూస్తూను జనార్దన్.

'కాదూ మరి? భార్యాభర్తలు కలి సుంటే అదేపండుగ'అంటూ తన మృణాల హస్తాలతో జనార్దనుని కౌఁగిలించుకుంటాన్నలంక రింప జేసింది లీలావతి.

'ఓహో! యివ్వాళనించే మనకి పండుగా? అయితే యీ వేషమంతా పండుగ సంబ్రమమేనా యేమిట'ంటూ లీలను దగ్గరకు తీసుకొన్నాడు.